# విశ్వజనని విచారం

రఘునాథ్ కందాళ

కన్నాగాని ఇలా కాగలదని కలగన్నానా
పెంచాగాని ఏ కొంచెమైన నే ఊహించానా?
నితాంత నిశిత మనీషా యుతుడౌ మావాడు
నిద్దుర లో కుమిలి కుమిలి ఏడుస్తాడెందుకని
నను ప్రశ్నిస్తే నేనేమనను?

నాభీచ్ఛేదం నాడే మొదలెడితే
ముడి విడదీసినందుకే అనుకున్నా..
శోకం నిత్యం కొలువుంటుందని
చెద పురుగై ఎద దొలిచేస్తుందని
కలగన్నానా, ఊహించానా?

విహగ విహారం విసారి చలనం
విస్మయుడై వీక్షించిన వాడు
నభోంతరాళపు వింత ప్రభలు
తన్మయుడై తిలకించినవాడు
రెక్కలు కట్టుకు మొప్పలు పెట్టుకు
దిగ్దిగంతాలు భూ నభోంతాలు
సప్త సంద్రాల గుప్త ప్రాంతాలు
గుట్టు రట్టు గా చుట్టుముట్టి మరి రాలేదా..
విహ్వలుడై విలపిస్తాడెందుకని
నను ప్రశ్నిస్తే నేనేమనను?

ఎగుర గలిచినా ఎరుక రాకనో?
ఎదురీత తెలిసినా భీతి పోకనో ?

గాలి నేలా నీరూ నిప్పూ
చెలరేగి విలయం చేస్తే
అవారితంగా రుజా ప్రహారం
అకాలముగ  ఆయుష్షు హరిస్తే
శిరస్సు వంచగ మనస్కరించక
పరిశీలనతో పరిశోధనతో
పరిపరి విధాల పరిశ్రమించి
ప్రకృతి తత్త్వం పరిష్కరించి
ధీ ప్రభువై ఇల మనలేదా..
పొగిలిపొగిలి ఏడుస్తాడెందుకని
నను ప్రశ్నిస్తే నేనేమనను?

ధర్మాధర్మ ఫార్ములా లేదనో
సత్యాసత్య సమీకరణమేదనో?

గోరంతలు నూరింతలుగా
పరమ శక్తి ప్రాదుర్భావానికి
పరమాణువునే పరిఖండించే
పరిజ్ఞానాన్ని ప్రకటించాడే..
పరలోకానికి సాధనమౌ
పరత త్త్వానికి ప్రతిపాదనమౌ
నిర్వాణ సూత్ర నిర్మాణ వేత్త
నిజమతావిష్కర్త మావాడు..
నిత్య శోకాన నీరౌతాడెందుకని
నను ప్రశ్నిస్తే నేనేమనను?

విడగొడితే విరుచుకుపడిందనో?
కనిపెడితే కబళించగ చూసిందనో?

పాపం ఎలా ఉలికి పడుతున్నాడో..
కడ తెలియని ఆ కన్నీళ్ళేమో
వెక్కిళ్ళేమో, ఎగబీల్పుళ్ళేమో..
ఏ కరాళ తమస్విని
జడలు విప్పి జడిపిస్తోందో
ఏ దుస్స్వప్నం
వెక్కి వెక్కి ఏడ్పిస్తోందో..
నను ప్రశ్నిస్తే నేనేమనను?

తెలిసిందొకటే చేయాల్సిందొకటే
మేలు కొలిపి ధైర్యం పాదుకొలిపి
అక్కున చేర్చి అలుపార్చి
హితమనుబోధించి శుభమాశించి
కన్న కడుపుగా
వెన్ను నిమరడం...!

అంతకన్న ఏం చేస్తానూ
కన్న తల్లిని?
వెన్నంట గలను గాని
అన్నీ నే కాగలనా?
కలలో నే చొరబడ గలనా
కలతలతో కలబడగలనా?
ఫాలం ముద్దాడగలను గాని
తన నిద్దుర నే పోగలనా?